క్లుప్తంగా

నీలంపాటి అమ్మవారి తిరునాళ్ల



బొల్లాపల్లి : మండలంలోని వెల్లటూరు నీలంపాటి అమ్మవారి తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సత్కరించారు. భక్తుల కోసం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'బీజేపీ పాలన ప్రమాదకరం'



చిలకలూరిపేట: కేంద్రంలోని బీజేపీ పాలన దేశానికి ప్రమాదకరమని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ, సీపీఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు విమర్శించారు. మతోన్మాద బీజేపీని సాగనంపుదాం– దేశాన్ని కాపాడుదాం అన్న నినాదంతో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారభేరి ముగింపు దశకు చేరింది. ఈ నేపథ్యంలో ఈనెల 25న పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభ కరపత్రాలను ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నాయకులు ఆవిష్కరించారు. సభను జయప్రదం చేయాలని కోరారు.

నేరాల నియంత్రణకు తనిఖీలు



చిలకలూరిపేట: నేరాల నియంత్రణలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు నరసరావుపేట డీఎస్పీ సి.విజయభాస్కర్ చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో ఆదివారం తెల్లవారు జామున పోలీసుశాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడారు. కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించరాదని సూచించారు. ఇళ్లు అద్దెకు ఇచ్చేటప్పుడు పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. తక్కువ ధరకు వస్తాయని సరైన పత్రాలు లేకుండా వాహనాలు కొనరాదని చెప్పారు. సరైన పత్రాలు లేని 24 బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ జి.రాజేశ్వరరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం



ఈపూరు : హిందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని బొగ్గరం, గుండేపల్లి గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఇంటింటికీ తిరిగి త్రైత సిద్ధాంత ఆదికర్త, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, 99 అనుబంధ గ్రంథాలను పరిచయం చేశారు. కార్యక్రమంలో చిలకలూరిపేట కమిటీ అధ్యక్షుడు, సభ్యులు యద్దనపూడి వీరాంజనేయులు, రామాంజనేయులు, చిన్రా వెంకటరామిరెడ్డి, మేకల వెంకటేష్, గంగయ్య, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార భేరి



రొంపిచర్ల: సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం సంతగుడిపాడు, రొంపిచర్ల, మాచవరం, వడ్లమూడివారిపాలెం, విప్పర్లపల్లి, మునమాక గ్రామాలలో ప్రచారభేరి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, నరసరావుపేట పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, మండల నాయకులు పిడెం హుస్సేన్, హర్ష, సీపీఎం పల్నాడు జిల్లా నాయకులు పెద్దిరాజు, కొమ్ముల నాగేశ్వరరావు, ఇజ్రాయిల్, సీఐటీయూ మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతుకు కష్టం

నరసరావుపేట రూరల్/రొంపిచర్ల/శావల్యాపురం/ఈపూరు/నాదెండ్ల : నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లోని పలు చోట్ల ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొన్నిచోట్ల వడగళ్ల వాన పడింది. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పొలాలకు పరుగులు పెట్టారు. కోత కోసి కళ్లాల మీద ఉన్న మిరప, మొక్కజొన్న పంటలు వర్షంపాలు కాకుండా టార్పాలిన్ పట్టాలు కప్పారు. దాదాపు అర్ధగంటపాటు కురిసిన వర్షం కర్షకులను హడలెత్తించింది. వర్షం అనంతరం టార్పాలిన్ పట్టాలపై నిలిచిన నీటిని రైతులు బయటకు పంపారు.



రొంపిచర్ల మండలంలో వర్షం ఆగిన అనంతరం ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తుతున్న రైతులు

● రొంపిచర్ల మండలంలో ఆదివారం వడగళ్ల వాన పడింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈదురుగాలులకు పలు గ్రామాల్లో వృక్షాలు నేలమట్టమయ్యాయి. రొంపిచర్ల శివాలయం కాలనీలో ఓ ఇంటిపైకప్పు రేకులు లేచి చెల్లాచెదురుగా సమీపంలోని పొలాల్లో పడ్డాయి. ఇంటిలో ఫ్యాన్లు కూడా విరిగిపోయాయి. రూ.లక్ష వరకు ఆస్తి నష్టం ఉంటుందని బాధితుడు నాగేశ్వరరావు తెలిపారు. కళ్లాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న, మిర్చి పంటలు తడవకుండా వాటిపై రైతులు పరదాలు కప్పారు. వాన వెలిసిన తర్వాత పంటలను ఇళ్లకు చేర్చుకున్నారు.

● శావల్యాపురం మండలంలో అకాల వర్షం ధాటికి మిరప, పొగాకు, మొక్కజొన్న సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంటలను కాపాడుకునేందుకు వారు పడరానిపాట్లు పడ్డారు.

● ఈపూరు మండలంలోని ఇనిమెళ్ల, భద్రుపాలెం, బొమ్మరాజుపల్లి గ్రామాల్లో వడగళ్ల వాన పడింది. పుచ్చకాయలు ఎక్కడికక్కడే పగిలిపోయాయి. బత్తాయి, మిర్చి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. బొప్పాయి పంట కూడా దెబ్బతిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

● నాదెండ్ల మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అకాల వర్షం కురిసింది. మిర్చి, పొగాకు, మొక్కజొన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు కష్టాలు పడ్డారు.



రొంపిచర్లలో ఈదురు గాలులకు ఇంటి పైకప్పు రేకులు లేచిన దృశ్యం



కనమర్లపూడిలో మిరప కళ్లంపై నిలిచిన వర్షపు నీరు



నాదెండ్లలో మిర్చి పంటపై పట్టాలు కప్పుతున్న రైతులు

యడ్లపాడులో వైద్యశిబిరం

యడ్లపాడు: ఆహారపు అలవాట్ల మార్పుతోనే చక్కెర వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చని సీనియర్ డాక్టర్ లింగమల్ల మోహన్ చెప్పారు. స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం జరిగింది. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ముందుగా షుగర్ వ్యాధి లక్షణాలు, వ్యాధి సంక్రమించిన తర్వాత ఆహారం, వైద్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం షుగర్, బీపీలకు పరీక్షలు నిర్వహించారు. విజయవాడకు చెందిన వైద్యులు గోపాలం శివన్నారాయణ వీడియో ద్వారా రోగులకు పలు సలహాలు, సూచనలు అందించారు. శిబిరంలో జూనియర్ డాక్టర్లు పోపూరి యామిని, శొంఠినేని లిఖిత, నంబూరి నవ్యశ్రీ 250 మంది రోగులను పరీక్షించారు. అనంతరం రెండు నెలలకు సరిపడ మందులను అందించారు. యడ్లపాడు అభివృద్ధి కమిటీ సభ్యులు కేతా రామబ్రహ్మం, గోనుగుంట్ల కిరణ్‌కుమార్, పోపూరి శ్రీనివాసరావు, ముత్తవరపు వేణుగోపాల్, బచ్చు రాజేష్‌కుమార్, విజన్ ఫౌండేషన్ సభ్యులు సామినేని శ్రీనివాసరావు, రావూరి సుమన్, సురేష్, కోయ రామోజీరావు పాల్గొని శిబిరం నిర్వహణకు సహకారం అందించారు.



వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ పోపూరి యామిని

నేడు యడ్లపాడులో జాతీయ పంచాయతీ దినోత్సవం

యడ్లపాడు: మండలంలో 30వ జాతీయ పంచాయతీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.హనుమారెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సోమవారం ఉదయం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా వేడుకల్లో ఉదయం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం ఉంటుందని వివరించారు. సాయంత్రం 4 గంటలకు యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పిడతల ఝాన్సీ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు హాజరుకావాలని కోరారు.

26 నుంచి బోయపాలెంలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం హైవే పక్కనే ఉన్న పురాతన బ్రహ్మంగారి ఆలయంలో ఈనెల 26 నుంచి 30 వరకు బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి 86వ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఈనెల 28న పార్వతీపరమేశ్వర కల్యాణం, గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలను ఆలయ అర్చకులు కనగాల వసంతాచార్యులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో కొనసాగుతాయని వివరించారు.

చౌడేశ్వరీ అమ్మ జ్యోతి ఉత్సవాలు ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: పాతూరులోని చౌడేశ్వరీ అమ్మవారి ఏకాదశ జ్యోతుల మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అభ్యంగన స్నానం, అలంకరణ, పూజాదికాలను నిర్వహించారు. తొలిరోజు ప్రధాన ఘట్టమైన కుంకుమ బండ్ల ఊరేగింపును ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అమ్మ వారి చిత్రపటం అలంకరించిన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి స్వయంగా నడిపి ఊరేగింపును ప్రారంభించారు. ఆలయం వద్దకు చేరుకున్న డాక్టర్ గోపిరెడ్డికి శ్రీతొగట వీర క్షత్రియ అభివృద్ధి సంఘం ప్రతినిధులు, పూజారులు స్వాగతం పలికారు. శ్రీచౌడేశ్వరీ అమ్మవారికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కుంకుమ బండ్ల ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలూరిపేటటౌన్: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా సోమవారం పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్.అశోక్ కుమార్ చెప్పారు. సుభానీనగర్, రాగన్నపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

పుస్తక పఠనంతో మేలు

చిలకలూరిపేటటౌన్: విద్యార్థులు పుస్తక పఠనం ద్వారానే జ్ఞానాన్ని సంపాదిస్తారని జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు చెప్పారు. ఆదివారం మండలంలోని వేలూరు గ్రామంలో గుర్రం జాషువా గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబాల్లో జరిగే శుభకార్యాల్లో చిన్నారులకు పుస్తకాలను బహుమతిగా ఇచ్చి వారి విజ్ఞాన ఎదుగుదలకు దోహదపడాలన్నారు. పెద్దలు, పిల్లలకు ఇవ్వాల్సిన విలువైన ఆస్తి పుస్తకాలని చెప్పారు. అనంతరం 100 పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంతా తిరుపతయ్య, సొసైటీ అధ్యక్షుడు దాసరి చిట్టిబాబు, సభ్యులు గేరా ఏకోబు, పానుగుపాటి బుల్లిబాబు, షేక్ బాజీ, ఉదయ్, రమేష్ పాల్గొన్నారు.



పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు

చింతపల్లిలో జనార్దనస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



కారెంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీ భూనీలా సమేత జనార్దనస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరుగుతాయని దేవదాయ శాఖ ఆలయ ఈఓ పి.సైదమ్మబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదీ స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుందని, ఈ సందర్భంగా మహాన్నదాన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్ర ప్రకారం బ్రహ్మోత్సవాలను యాజ్ఞీకులు కొండవీటి వేణుగోపాలాచార్యులు, అర్చకుడు మారేపల్లి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తారని ఈఓ తెలిపారు.

అగస్త్యేశ్వర స్వామికి అన్నాభిషేకం

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలో అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో వైశాఖ శుద్ధ అక్షయ తృతీయ రోహిణి నక్షత్రం సందర్భంగా స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, లక్ష మల్లెల పూజ, అమ్మవారికి శ్రీ సూక్త విధాన కుంకుమ పూజలు జరిగాయి. కాశీభొట్ల విశ్వరాయశర్మ శిష్య బృందం అర్చకులు బుద్ధు సుందర శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవాలయ కార్యనిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



అగస్త్యేశ్వర స్వామికి అన్నాభిషేకం

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు



విజయపురిసౌత్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 గంటలకు 5వ తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 12 గంటలకు ముగిసింది. అలాగే మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగింది. కాగా 5వ తరగతిలో చేరేందుకు మొత్తం 231 మంది దరఖాస్తు చేసుకోగా 202 మంది ఎంట్రెన్స్ పరీక్షకు హాజరయ్యారు. అలాగే మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో చేరేందుకు 215 మంది దరఖాస్తు చేసుకోగా 173 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలను కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీరాజ్యం, వైస్ ప్రిన్సిపల్ దారా మేరి మంజుల, అబ్జర్వర్ నాగజ్యోతి పర్యవేక్షించారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల) : గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతిచెందిన ఘటన కురిచేడు–గుండ్లకమ్మ రైల్వేస్టేషన్ల మధ్యలో ఆదివారం జరిగింది. నరసరావుపేట రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 55 ఏళ్ల వ్యక్తి గూడ్స్ రైలు బండి కింద పడి ఆత్మహత్య చేసుకుని మరణించాడు. మృతుడు తెలుపు రంగు నిండు చేతుల చొక్కా ధరించి ఉన్నాడు. చేతుల మీద త్రిశూలం, గణేషుడి బొమ్మ పచ్చబొట్లు ఉన్నాయి. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రిలో మార్చూరీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు 9948525386, 9542424899 నంబరును సంప్రదించాలని రైల్వే పోలీసులు సూచించారు.



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్

యడ్లపాడు/నాదెండ్ల: తిమ్మాపురం ఎస్సీ కాలనీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ పాలనలో పథకాల లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారుల అనుమతితో ఇళ్లకు, సెల్‌ఫోన్లకు జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు బిరుదు అనంతబాబు, గృహసారథులు పాల్గొన్నారు.

నాదెండ్ల మండలంలోని గణపవరం, బుక్కాపురం, నాదెండ్ల, సంకురాత్రిపాడు గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో అందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. గృహ యజమానుల అనుమతితో ఇళ్లకు, సెల్‌ఫోన్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ నూరా శంకరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లడి రవికుమార్, కె.రామకృష్ణ, పి.వీరయ్య, గాలి హనుమంతరావు, జెట్టి బొల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం



గణపవరంలో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న గృహ సారథులు, నాయకులు

ఆదర్శప్రాయుడు కోట వందనం

నాదెండ్ల: భావితరాల నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని నెల్లూరు జిల్లా విశ్రాంత డెప్యూటీ కలెక్టర్ గొర్రెపాటి అచ్యుతరావు చెప్పారు. మండలంలోని సాతులూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కోట వందనం సంస్మరణ సభ ఆదివారం జరిగింది. వందనం చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి హాజరైన అచ్యుతరావు మాట్లాడుతూ వందనం మాస్టారు 1965లో ఉపాధ్యాయ వృత్తిలో చేరి 1994లో తన సొంత గ్రామంలోనే ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేశారన్నారు. తన సర్వీసులో ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారు జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేశారన్నారు. ఆయన కుటుంబంలో భార్యతోపాటు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నత విద్యావంతులుగా రాణించటం అభినందనీయమన్నారు. మొదటి కుమారుడు రవీంద్ర ఒంగోలు ప్రభుత్వాస్పత్రిలో వైద్యాధికారిగా పనిచేస్తూ మంచి సేవలందిస్తున్నారన్నారు. ప్రస్తుత ఉపాధ్యాయులకు వందనం ఆదర్శనీయుడన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కలెక్టర్ కోట రోజ్ మాండ్, బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పానుగంటి ప్రశాంత్, డాక్టర్ రవీంద్రబాబు, డాక్టర్ ఫణికుమార్, ప్రదీప్‌కుమార్, మేరి విక్టోరియారాణి, ఉదయశ్రీ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వందనం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విశ్రాంత డెప్యూటీ కలెక్టర్ అచ్యుతరావు, కుటుంబ సభ్యులు

శారదాంబ జ్యూయలర్స్‌లో జోరుగా విక్రయాలు

నరసరావుపేట: నరసరావుపేటలో అతిపెద్ద బంగారు, వెండి, వజ్రాభరణాల షోరూం శారదాంబ జ్యూయలర్స్‌లో అక్షయ తృతీయ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వినియోగదారులతో షాపు కిటకిటలాడుతోంది. పెళ్లిళ్ల సీజన్ రాబోతున్నందున బంగారం ధర పెరిగే ఆస్కారం ఉన్న నేపథ్యంలో శారదాంబ జ్యూయలర్స్‌లో తరుగు, రాళ్ల ఖరీదు, మజూరీ లేకుండా అమ్మకాలు చేస్తుండటంతో వినియోగదారులు ఆభరణాల కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు. ఈ సందర్భంగా శారదాంబ జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్స్ నాగసరపు సుబ్బరాయగుప్తా, రూపేష్‌గుప్తా, రాందేవ్ గుప్తా మాట్లాడుతూ రానున్న రోజుల్లో బంగారం ధర పెరుగుతుందనే భావనతో వినియోగదారులు అధిక సంఖ్యలో వస్తున్నారని చెప్పారు. అక్షయ తృతీయ సందర్భంగా తాము ప్రకటించిన ప్రత్యేక ఆఫర్‌ను పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వడ్డాణాలపై ప్రత్యేక ధర అందుబాటులో ఉన్నట్టు పేర్కొన్నారు. అలాగే కిస్నా బ్రాండ్ వజ్రాభరణాల అమ్మకాలూ జరుగుతున్నట్టు వివరించారు.



అక్షయ తృతీయ సందర్భంగా షాపులో వస్తువులను పరిశీలిస్తున్న వినియోగదారులు

నవోదయ మోడల్ గ్రాండ్ టెస్టుకు విశేష స్పందన

వినుకొండ టౌన్: స్థానిక కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జవహర్ నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు సాయిరాం ఇంగ్లిష్ మీడియం పాఠశాల డైరెక్టర్ ముప్పాళ్ళ చంద్ర పేర్కొన్నారు. మోడల్ పరీక్షకు 168 మంది విద్యార్థులు హాజరు కాగా 100 మార్కులకు నిర్వహించిన పరీక్షలో 96.25 శాతం మార్కులను కుక్కల రాజశ్రీ, కావలి సురేంద్ర జోయల్, కట్టా సాత్విక్ వర్మ సాధించారని, వారితోపాటు ఆరుగురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని వివరించారు. వీరందరికీ నగదు బహుమతి, పతకాలు అందించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో కృష్ణవేణి జూనియర్ కళాశాల డైరెక్టర్లు, సిబ్బంది, హర్ష, భాష్యం ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ పోకూరి శ్రీనివాసరావు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో నిర్వాహకులు

సూర్యలంక జనసంద్రం



పోటెత్తిన భక్త జనులతో సూర్యలంక సముద్రతీరం ఉప్పొంగింది. తొలిపొద్దు వెచ్చని కిరణాలతో సంతోషాలు వికసించాయి. కడలి కెరటాల స్పర్శతో తీరం కేరింతలతో మార్మోగింది. రంజాన్ పర్వదినం అనంతరం ముస్లింలు ఆదివారం సూర్యలంక తీరానికి చేరుకున్నారు. తమ కుటుంబంతో సంతోషంగా గడిపారు. లక్ష మందికిపైగా భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు.

– బాపట్ల అర్బన్